# ప్రేమించకు ప్రియా!

కప్పిలి పద్మ

**యెంత** కష్టపడీ నీకు అర్థమయ్యేట్టు చెప్పలేక పోతున్నాను. మాటలకి మధ్య పొడుచుకు వస్తున్న మోహమాటాలు, ఆత్మాభిమానాలు. వాటికి తోడు సరిగ్గా కమ్యూనికేట్ చేయలేని అక్షరాల అశక్తత.

సాధ్యమయినంత ముక్తసరిగా చెబుతాను. సాధ్యమయినంత గాఢంగా చెబుతాను. నువ్వు అర్థం చేసుకోగలవు. అర్థం కానట్టు బ్లాంక్ ఫేస్ పెట్టకు.

మనిద్దరం ఒకరినొకరం యిష్టపడ్డా ఆ విషయం నీకు నేను ప్రత్యేకంగా పదేపదే చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను. దాదాపు సంవత్సరంగా మనం స్నేహితులం. అందులో మొదటి కొద్దిరోజులు మనం చాలా దగ్గర స్నేహితులం. తరువాత మార్పు వచ్చింది. ఆ మార్పు నాకు సరిగా అర్థం కాకపోవడం వల్ల దాన్ని నేను తిరస్కారం గానే తీసుకున్నాను. మన స్నేహం నాకు యెంత శక్తిని వుత్సాహాన్నిచ్చిందో ఆ స్నేహం కోల్పోవడం అంతకు కొన్ని రెట్లు ఆసక్తురాలిని చేసి. నిరుత్సాహాన్ని కలిగించింది. కాలం గడుస్తున్న కొద్దీ నాలో అసహనమూ పెరిగింది. తిరిగి మన స్నేహాన్ని పునరుద్ధరించుకోవాలన్న ఆకాంక్ష పెరిగింది. తర్వాత తర్వాత నన్ను నేను ఈ నిరాశ చికాకు నుంచి రక్షించుకోవాలనిపించింది. చాలాకాలంగా కొనసాగిన ఒక యాతన పర్యవసానంగా చాలా నిరాశా నిస్పృహలలో వున్నాను. నా ఓపిక తగ్గిపోయింది, అన్ని రకాలుగా యే పనీ చేయలేని ముజ్జు స్థితిలోకి వెళ్లిపోయాను. ఒక యెడారిలో ఒంటరిగా రోజుల తరబడి దాహంతో ప్రయాణించిన అనుభవం నాది. ఇంతకాలం నడిచావు, ఇంకాస్త దూరం నడవలేవా అంటే- గణిత శాస్త్రానికి సంబంధించిన సమస్య కాదు. నేను ఇంక నడవలేను అంటే నా ప్రియాతి ప్రియమైన స్నేహితుడిగా నీకు అర్థం కాదా!

నేను అనుభవించిన బాధ నీకు యెంత అర్థమయిందో కానీ, నాది మాత్రం ప్రత్యేకమైన బాధ. ఇన్ని రోజులు నేను నాతోనే ఎక్కువగా మాట్లాడుకున్నాను. మన స్నేహం పరిమితులు నాకు క్రమంగా అవగాహనకు వచ్చాయి. మన ప్రేమకు, అర్థం లేదని అనేకసార్లు అనిపించింది. సమాజంలో, మన వునికిలో వున్న అనేక విషయాలను దృష్టిలో పెటుకుంటే మనది, ముఖ్యంగా ఎటువంటి మానసిక, శారీరక పారవశ్యమూ లేని ప్రేమ అని కూడా అనిపించింది. మన ప్రేమ మొదటి రోజులలోని అనుభూతుల గొడుగులో ఎక్కువ కాలం నన్ను నేనుగా కాపాడుకోలేను. నన్ను ఆవరిస్తున్న నా నిర్వ్యాపకత్వాన్ని, పనికి మాలిన తనాన్ని అసహ్యంచుకోవడం మొదలు పెట్టాను. అప్పుడిక నాలో బలంగా ఒక ఫీలింగ్ ప్రవేశించింది. ఈ స్నేహం ఎటువెలితే అటువెళ్లనీ ఎప్పుడు తనకు నామీద మళ్ళీ ప్రేమ వొస్తే అప్పుడే రానీ అనుకున్నాను.

నిరీక్షణా వొద్దు, నిరాశా వద్దు, విరహమూ వొద్దు అనుకున్నాను. తిరిగి అచ్చంగా నాదైన జీవితంలోకి వెళ్లిపోదామనుకున్నాను. నేను అనుకున్నా నువ్వు నా చుట్టూ బిగించి పెట్టిన సంకెళ్లు నన్ను పట్టి వుంచాయి. మనం స్నేహితులుగా వున్న కాలంలో వాటిని. ఎప్పుడూ సంకెళ్లు అనుకోలేదు. అవి నన్ను, అనేక మార్లు బాధించినా ఈ మాత్రం బంధం వుండబట్టే కదా ఇంకా కొంచెం ఆశకు, కొంచెం స్నేహానికి అవకాశం






20-3-98, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక.

మిగిలింది అనుకున్నాను. అయితే, అవి నన్ను పట్టివుంచినంత కాలం నాలో నిరీక్షణ ఆగిపోదని, నిస్పృహ తొలగిపోదని, నేను మామూలు మనిషిని కాలేనని అర్థమయ్యింది. అప్పుడిక మనం చేస్తున్న పని నుంచి, ఇంటి నుంచి వెళ్లిపోతానని నీతో చెప్పాను, మన మధ్య రెగ్యులర్‌గా వుదయమే వొకరి ముఖాలొకరు చూసుకుంటూ, పనులు చేసున్నా కూడా మన మధ్య క్వాలిటేటివ్ స్నేహానికి మే మాత్రం ఆస్కారం ఇవ్వని పరిస్థితి మీద నాకు క్రమంగా అయిష్టం కలగడం మొదలయింది. నీతో రెగ్యులర్ ఇంటి పని, బయటి పని సంబంధం లేకుండా వుంటే నేను వేరే పనులలో తలమునకలు కావచ్చునని, తద్వారా నా మీద, నీ మీద కూడా వుంటున్న వొత్తిడిని తగ్గించుకోవచ్చునని అనుకున్నాను. యెలాగూ, ఇక మనం ప్రేమికులుగా దగ్గర కాలేం కాబట్టి ఇతర రూపంలో స్నేహాన్ని కొంతకాలం తరువాత పెంపొందించుకోవచ్చునని, ఆ గ్యాప్‌లో నాలోవున్న బిట్టర్‌నెస్ కూడా తగ్గిపోతుందని నా ఆలోచన. అయితే పని సంబంధాల నుంచి నన్ను ఎలా విముక్తం చేసుకోవాలో అర్థం కాలేదు.

ఇంతలో నీ కొత్త స్నేహం తెలిసొచ్చింది. అయితే మన మధ్య ఈ గ్యాప్‌కి కారణం స్నేహం కాదు, మనకి కొత్త స్నేహాలు ఎప్పుడూ వచ్చే అవకాశం వుంది. వాటిల్లో కొన్నింటికి స్త్రీపురుష స్వభావం వుండొచ్చు. ఏమీ లేకపోనూ వచ్చు. స్నేహాలు రాకుండా కిటికీలు మూసేసుకోలేం కదా. స్నేహాలకి ఎప్పుడూ అభ్యంతరం వుండదు. అయితే ఆ స్నేహం వలన మన స్నేహ స్వభా●ంలో వచ్చిన మార్పు ముఖ్యమయింది. మన స్నేహాన్ని నువ్వెంత బాలన్స్‌డ్‌గా చూసావ్ అన్నది ముఖ్యం. ప్రతి స్నేహాన్ని ఇండివిడ్యువల్‌గా డీల్ చేస్తాం కదా. అయితే నువ్వు నీ కొత్త స్నేహంలోకి వెళ్ళే ప్రతిసారీ నీ పూర్వ స్నేహాలని విలువైనవిగా చూడగలుగుతున్నావ్. నువ్వు, నీ స్నేహం నాకు ఎంత ముఖ్యమైనవి అయినప్పటికి నీకు ఈ స్నేహం ముఖ్యమైనది, విలువైనది కాకపోయేసరికి మన ఈ స్నేహాన్ని ముందుకు తీసుకుపోలేను. నీకు స్నేహాలని బాలెన్స్ చేయడం రాక ఈ మన స్నేహం ఇక్కడే అయిపోయింది. నా పై నీకు కలిగిన యిష్టాన్ని ఎంతో ధైర్యంగా సునాయాసంగా చెప్పినట్టే నా పై యిష్టం తగ్గుతున్నపుడు అంతే ధైర్యంగా సునాయాసంగా చెప్పగలగాలిగా. నీలో నేను ఆమోదించలేని గుణాలలో ఒకటి అడ్‌హోకిజం. అంటే మౌలిక సమస్య పరిష్కారాన్ని పక్కన పెట్టి, ఆ సమస్య ఫలితంగా

ఎదరయ్యే చిన్న చిన్న సమస్యలను మాత్రం యేదో రకంగా తాత్కాలికంగా పరిష్కరించుకోవాలని చూడడం. మీ దృష్టిలో ఇప్పుడు మీకు తక్షణం ఎదరయిన సమస్య నీ కొత్త ప్రేమ ఎన్నాళ్ళుంటుందోనన్న ప్రశ్న. ఆ సమస్య దృష్టి పెట్టే నాకే విషయం చెప్పవు. నీ కొత్త ప్రేమలోకి వెళ్ళటం నీ సమస్య. నాతో మన విషయం ఏమీ మాట్లాడకపోవడం నా సమస్య. మనిద్దరి మధ్య దూరం ఎందుకు పెరుగుతుందో. మనం మాట్లాడుకోపోతే రోజులు గడుస్తున్న కొద్ది దూరం దాటలేని దూరం అవుతుందని వేరే చెప్పనక్కర లేదు.

కలిసి జీవించడాన్ని మనిద్దరమే నిర్ణయించుకున్నాం కదా. విడిపోవడాన్ని మనిద్దరమే నిర్ణయించుకోవాలి కదా. కలిసి బ్రతకడం మొదలు పెట్టాం కదా ఎలా విడిపోవడమని నువ్వడుగుతున్నావ్. ఓ జీవితం మొదలయినప్పుడున్న వుత్తేజము పారవశ్యమూ తగ్గిపోయాక కూడా అందులోనే కొనసాగాలనుకోవడం, ఏవిలువల నుంచి వచ్చిందో, వస్తుందో మనకి తెలుసు కదా. నువ్వెంత కాదన్నా నేను కొనసాగడం అంటే మరికొంత కష్టపడానికి సిద్ధపడడమే. నీ మాట మీద నమ్మకం లేకపోవడం కాదది. ఒకసారి కమిట్ అయితే-తరువాత యెలా వున్నా కొనసాగాల్సిన బాధ్యత నామీద వుంటుంది. ఇన్ని రోజులు కష్టపడి - ఇక్కడ కష్టం అంటే ఫిజికల్ కష్టం కాదు- చివరకు ఒక గట్టి నిర్ణయం తీసుకుని- ఇప్పుడు మళ్లీ నికరంగా తేల్చుకోకుండానే నా స్టాండ్‌ను మార్చుకోవాలంటే నాకెంత కష్టంగా వుంటుందో ఆలోచించు.

నీ కొత్త ప్రేమ తాత్కాలికం అని నువ్వు అంటున్నావు, నీ తాత్కాలిక ప్రేమల మధ్య నో శాశ్వత ప్రేమగా నేనుండాలంటున్నావు. నువ్వు ఇలా తరుచు కొత్త కొత్త ప్రేమల్లోకి వెళ్లడం నీయిష్టం. నీ అభిరుచి. కాని నన్ను నీ నుంచి వెళ్ళొద్దని నువ్వు డిమాండ్ చేస్తూ ఆ డిమాండ్‌ను శాశ్వత ప్రేమగా గుర్తించమంటున్నావు. ఏదో ఒకరోజు ఆ ప్రేమ పోతుంది. తిరిగి మనిద్దరం మన ప్రపంచంలో వుంటాం అంటున్నావు.

ఏ ఇద్దరి మధ్య సంబంధం స్థిరపడటానికైనా చాలా సుదీర్ఘమయిన అనుభూతులు అవసరం అవుతాయి. మన్మథుడు చాటు నుంచి బాణమేసి మన మనసుల్ని వున్నపళాన మార్చేస్తాడని నేను అనుకోవడం లేదు. మనిద్దరం వున్న పరిస్థితులను, కలవడానికి వున్న పరిమితమయిన అవకాశాలను, తీర్చిదిద్దడానికి యాక్సిడెంట్‌ల మీద ఆధారపడటం ఎంత అమానమా నకు తెలుస్తుంది.

స్పర్శ అనేది నేను గతంలో చెప్పినట్టు ఒకరు మరొకరికి యిచ్చే కానుక కాదు. పరస్పరం యిచ్చి పుచ్చుకునే కానుక. నీకు నా స్పర్శ అక్కరలేకుంటే నీ స్పర్శను కోరడంలో అర్థం లేదు. పెనలాడుకోవడానికి స్పర్శ ఒకసరుకు కాదు. యెంతటి ప్రేమతోనూ దాన్ని మార్పిడి చేసుకోము అనడానికి అది అంత మడికట్టుకోవలసినదీ కాదు

మన పరిచయం, స్నేహం, ప్రేమ ఈ మొత్తంలో మనం సంతోషంగాను వున్నాం, బాధ పడ్డాం

నాకు యింకా ఈ ఏమీలేని కాలాన్ని ఎవరి కోసమూ కొనసాగించాలని లేదు.

నేను బాధ పడ్డా మరో విషయం చెబుతున్నా ఇతర పని వొత్తిడుల కారణాలను, కెరీర్ సమస్యలను నువ్వు అసలు గుర్తించలేకపోవడం, వాటిని ముఖ్యమయినవిగా పరిగణించకపోవడం. నేను నా జీవితంలో రాణించడం నాకు మాత్రమే కాదు, నీకు కూడా సంబంధించిన సమస్య అని నువ్వు అనుకుంటే నా మీద వున్న పని వొత్తిడులు అర్థం అవుతాయి. నీకు సంబంధించిన సామాజిక, వ్యక్తిగత అవసరాలను మొత్తం జీవిత సాఫల్యానికి ఏదన్నా కొంచెం సాయపడాలని నేను ఆలోచిస్తాను. నా పరిమితులు నీకు తెలుసు. కానీ నా మనసులో యెప్పుడూ నువ్వు నాకు ముక్కలు ముక్కలుగా హడావిడిగా దర్శనాలిచ్చే చాటుమాటు ప్రేమికుడివి కాదు.

వో ఆదర్శం కోసమో ఫ్యాషన్‌గానో ఆధునికమో అనుకొని 'ఫ్యామిలీలో లేను- ఫ్యామిలీ అంటే చికాకు' అనేమాటలు మాట్లాడుతూ అంతరంగంలో చేతల్లో కుటుంబ పరిరక్షణ, కుటుంబ గౌరవము, కుటుంబం.... కుటుంబం.... అని కలవరిస్తూ కుటుంబం నీకిచ్చిన పేరు, ఆస్తి , గర్వం నరనరాల్లో ప్రవహిస్తూంటే ఆధునిక మానవీయ ప్రేమ సహజీవనం -'లివింగ్ టుగెదర్'ని ఆశ్రయించకు, ప్రసంగించకు అభాసుపాలవుతావ్.

కలిసి జీవించడానికి ట్రాన్స్‌ఫరెన్సీ చాలా ముఖ్యం. అది నీకు అర్థం కాకపోతే ఇలానే శాశ్వత ప్రేమల గురించి మాట్లాడుతుంటావ్. ప్రేమ పోయినా కలిసి జీవించే సూత్రాలు మనకి వాడుకలో చాలానే వున్నాయి. వాటిల్లో ఏదో వొకటిని ఆశ్రయించు.

ఆల్ ది బెస్ట్. ●

నిరాక్షిణా వొద్దు, నిరాశా వొద్దు, విరహమూ వొద్దు అనుకున్నాను తిరిగి అచ్చంగా నాదైన జీవితంలోకి వెళ్ళిపోదామనుకున్నాను.

